## ప్రసంగము 2

# ఇశ్రాయేలు మీద దేవుని ఆరోపణ (1): నేరము మరియు శిక్ష

## (హోషేయ 4-10)

"ఇశ్రాయేలు వారలారా, యెహోవా మాట ఆలకించుడి. సత్యమును కనికరమును దేవుని గూర్చిన జ్ఞానమును దేశమందు లేకపోవుట చూచి యెహోవా దేశ నివాసులతో వ్యాజ్యమాడుచున్నాడు" (4:1) అన్న మాటలతో హోషేయ 4వ అధ్యాయం ప్రారంభమవుతుంది.

"యెహోవా దేశ నివాసులతో [ఇశ్రాయేలుతో] వ్యాజ్యమాడుతున్నాడు": ఈ మాటలు చట్టపర మాటలు అనగా న్యాయస్థానంలో వాడే మాటలు. దేవుడు ఇశ్రాయేలు మీద ఒక వ్యాజ్యమును వేయనున్నాడు అని హోషేయ చెప్తున్నాడు. అలంకార పదాలలో చెప్పబడుచున్న ఈ సన్నివేశంలో దేవుడు తన వ్యాజ్యమును వినిపించే న్యాయవాదిగా నున్నాడు. అలాగే ఆ వ్యాజ్యము విషయంలో తీర్పునిచ్చే సర్వోన్నత న్యాయసబాధిపతిగానూ ఉన్నాడు!

ఇశ్రాయేలు మీద దేవుని ఆరోపణ ఏమిటి? ఇశ్రాయేలు ఏ "దోషం" చేసింది? ఈ వ్యాజ్యం లేదా ఆరోపణ యొక్క ఫలితం ఏమిటి? 4 నుండి 10 ఆధ్యాయాలు ఇశ్రాయేలు యొక్క "నేరం," దోషములు, దానికి ప్రతిఫలంగా అది పొందుకోనున్న శిక్ష గురించి చెప్తున్నాయి. ఇశ్రాయేలు దోషముల విషయమై మనము హెచ్చరించబడాలి. తద్వారా ఇశ్రాయేలు పొందుకున్న శిక్షనే మనము పొందకుండా జాగ్రత్త పడవచ్చు.

### నేరము

ఇశ్రాయేలు చేసిన పాపాలు ఏమిటి? వారి పాపములను గురించి అలోచిస్తున్నప్పుడు మన గురించి కూడా ఆలోచించుకోవాలి. మనము అటువంటి దోషముల విషయంలో నేరస్థులముగా ఉన్నామా? అదే అయితే ఇశ్రాయేలును శిక్షించిన అదే దేవుడు మనలను కూడా శిక్షించడా?

#### సాధారణ దుష్టత్వం

ఇశ్రాయేలు యొక్క దుష్టత్వమును బట్టి దేవుడు దానిని ఖండించాడు. ఇశ్రాయేలు తన పాపములో ఎంతోకాలం ఉండింది. "వారు దేవుని మందిరములో శత్రువులై యున్నారు. వారు బహు దుర్మార్గులైరి" (9:8, 9) అని హోషేయ చెప్తున్నాడు.

#### నిర్దిష్ట పాపములు

ఇశ్రాయేలు చేసిన సాధారణ దుష్టత్వం గురించి మాత్రమే హోషేయ చెప్పడం లేదు. అది చేసిన నిర్దిష్ట పాపములను గురించి కూడా అతడు చెప్తున్నాడు. ఇశ్రాయేలు చేసిన నిర్దిష్ట

పాపములలో కొన్ని:

1. *అన్యదేవతారాధన.* ఇశ్రాయేలు చేసిన పాపములన్నిటిలోనూ విగ్రహారాధన అతి ప్రధానమైనది. ఉత్తర రాజ్యం పదే పదే పది ఆజ్ఞాలలోని మొదటి రెండు ఆజ్ఞలను అతిక్రమిస్తూనే వచ్చింది. వారు అన్యదేవతలను ఆరాధిస్తూ వాటి రూపంలో విగ్రహాలనూ చేస్తూ వచ్చారు. "ఎఫ్రాయిము విగ్రహాములతో కలిసికొనెను" అని హోషేయ చెప్తున్నాడు (4:17; చూడండి 4:12, 13; 8:4–6; 10:1). ఇశ్రాయేలు అన్యదేవతలను అనుసరించడం గురించి (5:3, 4, 7; 6:10; 9:1), ప్రవక్త ఖండిస్తూ దానిని "వ్యభిచారంగా" చెప్తున్నాడు. దేవుడు ఇశ్రాయేలును వివాహం చేసుకున్నాడు కాబట్టి అది అన్యదేవతలను ఆశ్రయించడం వ్యభిచార చర్యగా చెప్పబడింది.

2. *తోటివారిని నిర్లక్ష్యం చేయడం.* ఇశ్రాయేలీయులు అన్యదేవతలారాధన చేయడం వలన వారు తమ తోటి వారిని నిర్లక్ష్యం చేశారు. "వారు విగ్రహారాధనకు తమ్మును తాము అప్పగించుకొనిరి." మరియు "తాము మోహించిన దాని వలెనే వారు హేయులైరి" (9:10). ఇశ్రాయేలుకు వ్యతిరేకంగా దేవుడు చేసిన ఆరోపణల్లో ఇదియు ప్రధానమైనది.

> సత్యమును కనికరమును దేవుని గూర్చిన జ్ఞానమును దేశమందు లేకపోవుట చూచి యెహోవా దేశనివాసులతో వ్యాజ్యెమాడు చున్నాడు. అబద్ధ సాక్ష్యము పలుకుటయు అబద్ధమాడుటము, హత్య చేయుటయు, దొంగలించుటయు, వ్యభిచరించుటయు వాడుకయ్యెను; జనులు కన్నము వేసెదరు మానక నరహత్య చేసెదరు (4:1, 2).

ఇశ్రాయేలీయుల "మోసపు క్రియలను" బట్టియు, "ఇతరులను దోచుకోవడాన్ని" బట్టియు వారు నాశనము నొందనున్నారని హోషేయ మరోచోట చెప్తున్నాడు (7:1). వారు దొంగలుగా, బందిపోటు దారులుగా మారుతున్నారు. దేశముగా వారు దుష్టత్వం (7:2); వ్యభిచారం (7:4); నిబంధనా – అతిక్రమమునకు (10:4) పాల్పడుతున్నారు.

3. *అపనమ్మకమైన వాటియందు నమ్మికయుంచడం.* అంతేగాకుండా, ఇశ్రాయేలీయులు దేవుని యందు నమ్మిక యుంచకుండా, అసత్యమైన ప్రజలు, ఆచారాలు, విషయాల యందు నమ్మికయుంచారు. వారు దేనియందు నమ్మిక యుంచాలి?

ప్రవక్తలు మరియు యాజకులు – ఇశ్రాయేలీయులు తమ మత నాయకులు తమను కాపాడుతారని నమ్మారు. అయితే, ప్రవక్తలు కూలిపోతారని (4:4, 5);[1] ప్రజలను రక్షించాల్సిన యాజకులు దేశమునకు వలగా నున్నారని హోషేయ చెప్తున్నాడు (5:1). ఆత్మీయ నాయకులై ప్రజలను రక్షించాల్సిన వారు "నరహత్య చేయుచు," "ఘోరమైన కార్యములు" జరిగించుచున్నారు (6:9). మత నాయకుల మీద నున్న నమ్మకం గతి తప్పింది; వీరే ఇశ్రాయేలు భవిష్యత్తు నాశనమునకు ఒక కారణముగా నున్నారు. దేశం శిక్షించబడినప్పుడు వీరూ శిక్షనొందుతారు. "జనులకు ఏలాగో యాజకులకు ఆలాగే" శిక్ష కలుగుతుంది. ఇద్దరూ తమ క్రియలను బట్టి తమ ప్రతిఫలాన్ని పొందనున్నారు (4:9).

ఇతర దేశములతో సంబంధాలు – దేవుని చిత్తానికి వ్యతిరేకంగా ఇశ్రాయేలు ఇతర దేశములతో సంబంధం పెట్టుకుంది. వారి ద్వారా ఎంతో క్షేమంగా ఉండవచ్చని అది భావించింది. ఉదాహరణకు, తమను చివరకు నాశనం చేసిన అష్షూరు దేశంతోనే పొత్తు పెట్టుకుంది (5:13; చూడండి 7:8, 9, 11, 12; 8:9, 10; 12:1). అయితే ఆ దేశాలు

తన పాపం యొక్క ప్రతిఫలం నుండి తనను కాపాడలేకపోయాయి.

రాజులు మరియు అధిపతులు – ప్రజలు పొరపాటున తమ నాయకుల మీదనే నమ్మకముంచారు. సమస్య ఏమంటే, వారి అధిపతులు, రాజులే దుర్మార్గతలో నున్నారు: వారు "అవమానకరమైన దానిని ప్రేమించారు" (4:18); వారిలోని దుర్మార్గతను చూచి వారే ఆనందిస్తున్నారు (7:3); వారెవ్వరూ దేవుని మీద ఆధారపడలేదు (7:7); వారు తిరుగుబాటు చేయువారు (9:15). నిజానికి ఇశ్రాయేల నాయకులు తమ సొంత ప్రజలనే తృప్తిపరచ లేకపోయారు; దేశం తరచూ రాజులను మారుస్తూ వచ్చింది (7:7) మరియు దేవున్ని సంప్రదించకుండానే నూతన రాజులను నియమిస్తూ వచ్చింది (8:4). ఇశ్రాయేలు రాజులు చూచి "ఉదయకాలమున ఇశ్రాయేలు రాజు కొట్టబడి నిర్మూలమగును" అని దేవుడు చెప్తున్నాడు (10:15).

యుద్ధోపకరణాలు, సైన్యం మరియు కోటలు – విమోచన నిమిత్తం ఇశ్రాయేలు దేవున్ని ఆశ్రయించడం పోయి, తన స్వంత బలాన్నే అది నమ్ముకుంది. దేవుడు తన ప్రజలతో ఇలా చెప్తున్నాడు. "నీ ప్రవర్తన నాధారం చేసుకుని నీ బలాఢ్యులను నమ్ముకుని నీవు చెడుతనపు పంటకై దున్నితివి గనుక మీరు పాపమను కోతకోసి యున్నారు. ప్రాకారములు గల నీ పట్టణములన్నియు పాడగును" (10:13, 14; చూడండి 8:14). దేవుడు తన ప్రజల పక్షాన యుద్ధం చేస్తే, దాన్ని గెలిచేందుకు గొప్ప సైన్యం అక్కర్లేదు (చూడండి 1:7).

మతాచారాలు – ఇశ్రాయేలు ఇంకనూ మనుగడ సాధించేందుకు తన మతాచారాల మీదనే ఆధారపడింది. ప్రజలు ఏం చేసినా గాని, తాము అర్పణలు అర్పిస్తే దేవున్ని సంతోషపరచవచ్చుని[2] ప్రజలు అనుకున్నారు. అయితే మతాచారాలు దేవున్ని సంతోషపెట్టలేవని, ఆయన ఉగ్రతను తప్పించలేవని హోషేయ చెప్తున్నాడు. దేవుడీలాగు చెప్తున్నాడు,

> నేను బలిని కోరను గాని కనికరమునే కోరుచున్నాను. దహనబలుల కంటే దేవుని గూర్చిన జ్ఞానము నాకిష్టమైనది (6:6).

ఈ వాక్యంలో మనం గుర్తించినట్టే, ఇశ్రాయేలుతో దేవుని కున్న సమస్య వారి అర్పణ లను దేవుడు నిరాకరించడం లేదా మతాచారాలను త్రోసిపుచ్చుడం (మోషే ధర్మశాస్త్రంలో ఆయన వాటిని ఆశించారు) కాదు, కానీ ఇశ్రాయేలు దేవున్ని మానవుడ్ని ప్రేమించడం అన్న వాటికి ఈ అర్పణలను ప్రత్యామ్నాయంగా చూచింది.

4. *దేవునితో విరోధం*: చివరిగా ఇశ్రాయేలు కున్న అసలు సమస్య దేవుని నుండి వేరై పోవడం. ఈ విరోధం హోషేయ గ్రంథంలో దేవున్ని ఎరుగక పోవడముగా చెప్పబడింది: "దేవుని గూర్చిన జ్ఞానము దేశమందు లేదు ..." (4:1; చూడండి 4:6; 5:4). "దేవుని గూర్చి జ్ఞానము కలిగి యుండడం" లేదా "దేవున్ని ఎరిగియుండడం" అంటే ఆయన ఎవరు ఆయన పేరు ఏమిటి, ఆయన గూర్చిన కొన్ని విషయాలు తెలుసుకొనడం లేదా ఆయన యందు నమ్మిక యుంచడం, ఆయన ధర్మశాస్త్ర విధులను ఎరిగియండడం కాదు. "ఆయన్ను ఎరిగియుండడం" అంటే ఆయనతో సరైన సహవాసం కలిగియుండడం. కాబట్టి దేవునికి వేరై పోవడం అంటే ఆయన్ను ఎరుగక పోవడమే! ఒక వ్యక్తి దేవున్ని ఎరిగియున్నాడని చెప్పాలంటే అప్పటి దేవుని ధర్మశాస్త్రాన్ని గైకొనినవాడై యుండాలి. ఇశ్రాయేలు దేవుని ధర్మశాస్త్రాన్ని మర్చిపోయింది కాబట్టి దేవుని గూర్చిన జ్ఞానము లేకపోవడం వలన ఇశ్రాయేలు

నశించిపోయింది (4:6).

ఇశ్రాయేలు "దేవుని లక్ష్యపెట్టుట మాని వేసింది" (4:10); వారు దేవుని ధర్మశాస్త్రాన్ని అనుసరించకుండా, "మానవ పద్ధతిని అనుసరించేందుకు వారు తీర్మానించుకున్నారు" (5:11). వారు దేవునికి అపనమ్మకంగా ఉన్నారు (6:4). "వారు దేవుని నిబంధనను మీరి" మరియు "ఆయనకు విశ్వాసఘాతకులైయున్నారు" (6:7). వారు "దేవుని నుండి చెదరిపోయి" ఆయన మీద "తిరుగుబాటు" చేసి ఆయన మీదనే అబద్ధ మాడియున్నారు (7:13). వారు దేవుని నుండి వెనుదిరిగి "ఆయన మీదనే దుర్యోచనలు చేశారు" (7:14, 15). వారు "దేవుని నిబంధనను అతిక్రమించి ధర్మశాస్త్రమును అతిక్రమించారు" (8:1). వారు తమ సృష్టికర్తనే మరచిపోయారు (8:14). వారి యొక్క పాపం ఈ విధంగా చెప్పబడింది: "వారి మనస్సు కపటమైనది గనుక వారు త్వరలోనే తమ అపరాధమునకు శిక్షనొందుదురు" (10:2).

## శిక్ష

హోషేయ గ్రంథం వ్రాయబడిన నాటికి ఇశ్రాయేలు వర్ధిల్లుతున్నది. వారికున్న "వెండి బంగారములతో" విగ్రహాలను నిర్మించారు (8:4). "నగరులను కట్టించుకున్నారు" మరియు "ప్రాకారములు గల పట్టణములు" (8:14) కట్టుకున్నారు. "వెండి మయముగా నిధులు వారికుండేవి" (9:6). ఇశ్రాయేలీయులు "లోయలో స్థాపింపబడిన తూరు" వంటి స్థానముగానున్నారు (9:13) మరియు "విస్తారముగా ధరించిన ద్రాక్షచెట్లవలె" నున్నారు. వారు ఫలభరితముగా నున్నారు (10:1; చూడండి 12:8).

దేశం వర్ధిల్లుతున్నాగాన్ని, ప్రజలు చేసిన అనేక తప్పిదములను బట్టి ఇశ్రాయేలు దేవుని ఎదుట నిలబడాల్సి వచ్చింది. వారి దోష విషయంలో ఏ సందేహమూ లేదు; వారి క్రియలకు తగిన ఫలితాన్ని వారు చూడల్సి వచ్చింది (4:9; చూడండి 8:3, 7, 12, 13; 9:9, 17; 10:2).

ఇశ్రాయేలు యొక్క శిక్ష ఎమైయుంది?

(1) జీవితంలో ఆవశ్యకమైన ఆహారం వారికి కొదువు కానుంది లేదా వారికి ఆహారమున్నా గాని అది వారికి తృప్తినియ్యలేదు (4:10).

(2) వారు ఆధారపడిన - రాజులు లేక అధిపతులు నశించనున్నారు లేదా హత్యాగాపించబడతారు (7:16; 10:15).

(3) ఇశ్రాయేలీయులు సంతానాన్ని ఆయన ఖండించి స్త్రీలను సంతులేని వారినిగా చేయనున్నాడు; అనగా వారి జనభా తగ్గిపోతుంది (9:11-17).

(4) వారి మీదకు దేవుడు అన్యదేశాలను రప్పింపనున్నాడు (10:10), అలా వారి ప్రాకారములు కూలనున్నాయి (10:14, 15) మరియు వారు చెరలోనికి పోతున్నారు (8:8, 13; 10:7). వారు చెరలోనున్నప్పుడు, అన్యమైన ఆహారం తింటారు, దేవునికి వారు అర్పణలు అర్పించలేరు. దేవుని ఆలయంలోకి రాలేరు కదా, ధర్మశాస్త్రానుసారమైన పండుగలను వారు ఆచరించలేరు (9:3-5).

(5) వారు చెరపోయిన తరువాత దేశం అన్యక్రాంతను వుతుంది (5:9; 9:6). విగ్రహారాధన, బలిపీఠము, ఉన్నత స్థలములు నాశనం చేయబడతాయి (10:2, 8), విగ్రహాలు కూడా చెరపట్టబడతాయి (10:5, 6).

రాబోవు నాశనం ఎంత విపత్కరంగా ఉండనుందంటే, మమ్మును "మరుగు చేయమని" పర్వతములతోను "మా మీద పడుడి!" అని కొండలతోను చెప్పు దినము అది (10:8; చూడండి లూకా 23:30; ప్రకటన 6:16).

(6) అన్నిటికంటే ఘోరమైన విషయమేమంటే, వారి నుండి దేవుడు దూరమవ్వడం- వారు ఆయన్ను వెదికినా కానీ వారాయన్ను కనుగొనలేరు (5:6).

ఇశ్రాయేలును కేవలం శిక్షించడం దేవుని ఉద్దేశం కాదు. వారిని శిక్షించి తద్వారా వారు తిరిగి ఆయన దగ్గరు రావడం ఆయన ఉద్దేశం.

> ఏలయనగా ఎఫ్రాయిమీయులకు సింహమువంటివాడనుగాను, యూదావారికి కొదమ సింహమువంటివాడనుగాను నేనుందును. నేనే వారిని పట్టుకొని చీల్చెదను, నేనే వారిని కొనిపోవుదును, విడిపించువాడొకడును లేకపోవును. వారు మనస్సు మనస్సు త్రిప్పుకొని నన్ను వెదకువరకు నేను తిరిగి నా స్థలమునకు పోవుదును; తమకు దురవస్థ సంభవింపగా వారు నన్ను బహు శీఘ్రముగా వెదుకుదురు (5:14, 15).

వారు పశ్చాత్తాపంతో తిరిగి దేవుని యొద్దకు రాలేదు. కాబట్టి క్రీ.పూ. 722లో రాజ్యమైన ఇశ్రాయేలు అష్షూరియా వారి చేత దండెత్తబడి నాశనం చేయబడింది. దాని ప్రజలు చెరపట్టబడ్డారు.

### ముగింపు

మరయితే దేశమునకు నిరీక్షణే లేదా? ఒక వేళ ఇశ్రాయేలు పశ్చాత్తాపం పొందితే, దేవుడు తన మనస్సు మార్చుకుని దేశమును నాశనం చేయ కుండా ఉంటాని హోషేయ నిరీక్షణను అందిస్తున్నాడు. ప్రజలు దేవుని వైపు తిరిగాలని, పునరుజ్జీవింపబడాలని హోషేయ ప్రకటిస్తున్నాడు (6:1-3ఎ; చూడండి 10:12).

అయితే ఇశ్రాయేలు యొక్క సమస్య తను చేసిన పాపం మాత్రమే కాదు గాని పశ్చాత్తాపం నొందలేకపోవడం కూడాను. "వారు తమ దేవుడైన యెహోవా యొద్దకు తిరుగక యున్నారు," "వెదుకక యున్నారు" (7:10); వారు తిరిగినను, "దేవుని యొద్దకు తిరుగరు" (7:16). వారు హృదయపూర్వకముగా "ఆయనకు మొఱ్ఱ పెడితే ఆయన వారిని విమోచిస్తాడని" చెప్తున్నాడు (7:13, 14). వారు పశ్చాత్తాపపడాలని ఆయన ఆశించగా, వారు దానికి నిరాకరించి తమ దుష్టత్వములోనే యున్నారు. అందుకనే ఇశ్రాయేలు నాశనం అయింది.

హోషేయ యొక్క సందేశాన్ని మన కాలానికి ఎలా అన్వయించగలము? ఆనాడు దేవుడు విగ్రహారాధనను, తోటివారిని శ్రమలు పెట్టడం, అపనమ్మకమైన వాటియందు లక్షముంచడం, దేవుని చిత్తానికి అవిదేయత చూపించడం వంటి వాటినే సహించనట్లే ఈ నాడు కూడా ఆయన వాటిని ఖండిస్తున్నాడు, ఆనాడు దేవుని ప్రజలు ఈ పాపముల విషయమై దోషులైనట్లే ఈనాడు ప్రజలు కూడా దోషులే! ఇశ్రాయేలువలె మనం కూడా దేవున్ని, తోటి వారిని ప్రేమించడానికి ప్రత్యామ్నాయంగా మతాచారలను ఉంచుతున్నామేమో! ఇశ్రాయేలు పాపాలను బట్టి దేవుడు వారిని శిక్షించినట్లే, మనమూ మన పాపాలను బట్టి పశ్చాత్తాప పడకపోతే మనమూ శిక్షింపబడతాము, ఆ నాడు ఇశ్రాయేలు పశ్చాత్తాపపడాలని దేవుడు కోరుకున్నట్లే ఈనాడు కూడా మనం పశ్చాత్తాప పడాలని ఆయన కోరుకుంటున్నాడు

(అపొస్తలుల కార్యములు 8:22; 17:30).

---

సూచనలు

[1]భయపడిన ప్రవక్తలు అబద్ధ ప్రవక్తలు అయ్యుంటారు. [2]తమ మతాచారాలలోని పరిశుద్ధ దినాలను వారు ఆచరించినట్లు హోషేయ 2:11 చెప్తుంది.